



వారధి మధ్య భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన గడ్డర్లు

సమరానికి సిద్ధం!

- నేటి నుంచి సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు
- జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో ఏఐయూ న్యూఢిల్లీ సహకారంతో నిర్వహణ
- ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 138 జట్లు

6

నేటి నుంచి ఏపీ టెట్

- జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 1,687 మంది ఉపాధ్యాయులు

అమలాపురంరూరల్,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఏపీ టీచర్‌ఎలిజిబుల్ టెస్ట్(టెట్)ను ఈనెల 10 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో రాయాల్సి ఉంటుందన్నారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. 12రోజులపాటు నిర్వహించే పరీక్షలకు సంబంధించి ఉదయం 9.30గంటలనుంచి మధ్యాహ్న 12గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు టెట్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల, చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఇప్పటికే ఆయా మండల విద్యాశాఖాధికారులు పరిశీలించారన్నారు. టెట్ రాసే ఉపాధ్యాయుడు పరీక్షా కేంద్రానికి గంట ముందు హాజరుకావాలన్నారు. హాల్ టిక్కెట్లపై ఫొటోగ్రాఫ్ లేని అభ్యర్థులు లేటెస్ట్ ఫొటోతో ఏదైనా గుర్తింపుకార్డు తీసుకుని పరీక్షా కేంద్రానికి రావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే దివ్యాంగులు టెట్-2025 దరఖాస్తులు పీహెచ్‌సీ పొందుపరచకుంటే వారు తమ వైకల్య ధ్రువీకరణపత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలను తెలియచేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి అనుమతితో సహాయకుడిని పొందవచ్చునన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలకు డిపార్టుమెంటల్ అధికారులుగా పారుపూడి పల్లయ్యశర్మ, టీహెచ్‌వీఎస్ రామకృష్ణలను నియమించారు. 12రోజులపాటు జరిగే ఈ పరీక్షలకు 1,687మంది ఉపాధ్యాయులు హాజరుకానున్నట్టు డీఈవో సలీంబాషా తెలిపారు.

దిండి-చించినాడ వారధి మరమ్మతులు

పూర్తయ్యేదెప్పుడో?



దిండి-చించినాడ బ్రిడ్జిపై పడిన గోతులు

- ఐదు నెలలుగా సాగుతున్న పనులు
- సంక్రాంతికి సిద్ధం చేస్తామంటున్న 216 హైవే అథారిటీ
- అధ్వానస్థితిలో దిండి-చించినాడ వారధి.. మరమ్మతుల్లో తీవ్రజాప్యం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉభయ గోదావరి జిల్లాల మధ్య వశిష్ట నదిపై దిండి-చించినాడ వారధి మరమ్మతుల కారణంగా కొన్నినెలలుగా భారీవాహనాల రాకపోకలను నిలిపివేయడంతో గోదావరిజిల్లాల ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. నిత్యంవేలాదిమంది ప్రజలు ప్రయాణించే ఈ వారధిపై బేరింగుల మరమ్మతుల పేరుతో ఐదునెలలుగా భారీవాహనాలను నిషేధించారు. దీంతో ఫోర్‌వీలర్లు, ఆటోలపై ప్రయాణాలు అనుమతించడంతో ప్రయాణికులు భారీగా నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో చదువుకునే విద్యార్థుల కష్టాలు అన్నీఇన్నీ కావు. వారధిపై రాకపోకలు నిషేధించినా ఎక్కడా వంతెన మరమ్మతు పనులను అధికారులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు బేరింగులు ఆర్డరు ఇచ్చామని, త్వరలో అవి వస్తే బిగించి సంక్రాంతికి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తామని హైవే అధికారులు చెప్తున్నారు.

సంక్రాంతికైనా పూర్తయ్యేనా..

216 జాతీయరహదారిలో భాగంగా దిండి-చించినాడ మధ్య వశిష్ట వారధిపై ఈ ఏడాది జూలై నెలాఖరు నుంచి వంతెన మరమ్మతుల పేరుతో భారీ వాహనాలను పూర్తిగా నిషేధించారు. దీంతో బస్సులు, లారీలు వంటి వాహనాల ప్రయాణాలకు బ్రేక్ పడింది. ఎన్‌హెచ్ అధికారులు ఆసియా ఖండంలోనే అద్భుతంగా నిర్మించామని చెప్తున్న చించినాడ వారధి మరమ్మతుల్లో భాగంగా గడ్డర్లు ఒకట్రెండు చోట్ల బీటలు వారాయని, బేరింగులు దెబ్బతినడంవల్ల వాటిని మార్పు చేయాలనే ప్రతిపాదనలతో హడావిడిగా వారధిపై రాకపోకలు నిలిపివేశారు. ఇప్పటికీ ఆ బేరింగులు ఇంకా రాలేదు. ఈ డిసెంబరు 15, 20 తేదీల్లోగా బేరింగులు వచ్చిన వెంటనే వాటిని గడ్డర్ల కింద ఏర్పాటు చేసి పనులను పూర్తి చేస్తామని ఎన్‌హెచ్ అధికారులు చెప్తున్నారు. దీంతో సంక్రాంతి వరకు అంటే ఆరునెలలపాటు ఈ వారధిపై రాకపోకలకు పూర్తిగా బ్రేక్ వేసినట్టే.

విద్యార్థుల పాలిట శాపంగా...

దిండి-చించినాడ వారధి మరమ్మతులు ఉభయజిల్లాల విద్యార్థుల పాలిటశాపంగా మారాయి. వంతెనకు అటు, ఇటువైపుల 30నుంచి 40 వరకు విద్యాసంస్థలకు చెందిన బస్సులు పార్కు చేసి ఉంటున్నాయి. విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళ అటు, ఇటు వారధిపై నడిచి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తుంది. స్కూళ్లు, కళాశాలలకు చెందిన ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు భారీగా రోడ్ల పక్కన పార్కు చేసిఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యార్థులు తమ నిర్ణీత సమయానికంటే ముందుగా బయలుదేరి వారధి వద్దకు చేరుకుని కాలినడకన కిలోమీటరుపైనే ఉన్న వారధిపై నడుచుకుంటూ ప్రయాణించాల్సిన పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల సమయంలో తాము పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావని ఆవేదన చెందుతున్నారు. బస్సుల డ్రైవర్లు సైతం వంతెనకు అటు, ఇటువైపుల బస్సులను పార్కు చేసి విద్యార్థులకోసం ఎదురుచూస్తూ ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

బ్రిడ్జిపై అడుగుకో గొయ్యి..

చించినాడ వారధిరోడ్డు ఛిద్రమైంది. అడుగుకో గొయ్యి.. గజానికో గుంత అన్నట్టు అధ్వానంగా మారింది. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు బేరింగుల మార్పిడి పనిపైనే దృష్టిపెట్టారు తప్ప వారధి ధ్వంసమైనా కనీస మరమ్మతులు ఈ ఐదునెలల్లో చేపట్టి ఉంటే ఎంతోమేలుగా ఉండేదని వాహనదారులు పేర్కొంటున్నారు. అసలు ఈబ్రిడ్జిపై రాకపోకలు ఐదునెలలుగా ఎందుకు నిలిపివేశారో, ఇక్కడ ఏంజరుగుతుందో ఎవరికీ తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని చించినాడకు చెందిన దామిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. అధికారులు ఈ బ్రిడ్జి మరమ్మతులపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రకరకాల ఊహాగానాలు వస్తున్నాయని, బ్రిడ్జి గడ్డర్లు బీటలు వారాయని, అందుకే ఆకస్మికంగా భారీ వాహనాలు వెళ్లకుండా నిరోధించారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి అడుగుభాగాన బేరింగు మరమ్మతులతోపాటు పైన వంతెన అధ్వానస్థితిని కూడా మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంత 'చిన్న' చూపేంటి?



- ఉమ్మడి జిల్లాల్లో చిన్ననీటి పారుదల వ్యవస్థ నిర్వీర్యం
- పదేళ్లుగా రిపేర్లకూ నిధులివ్వని వైనం
- ఏజెన్సీ ఎత్తిపోతల పథకాలన్నీ దాదాపుగా మూత
- నిర్వహణ బాధ్యత కార్పొరేట్‌కు అప్పగించే యోచన
- ఇప్పటికే రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- ఇది అమలైతే వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
- అయినా రోజులు గడుస్తున్నా ముందుకు కదలని వైనం

గోదావరి జిల్లాలో నీరు పుష్కలంగా ఉంటుందనేది చాలామంది అభిప్రాయం. కానీ ఇక్కడా మెట్ట ప్రాంతం ఉంది. అటు కాలువల నీరూ, ఇటు బోరు నీరు కూడా లభ్యంకాని పొలాలు వేలాది హెక్టార్లలో ఉన్నాయి. వీటిని సాగు చేయడానికి గతంలో ఏర్పాటుచేసిన చిన్న నీటిపారుదల వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. ముఖ్యంగా గత వైసీపీ హయాంలో పైసా విదల్చలేదు. దీంతో మొత్తం చిన్న నీటిపారుదల వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైపోయింది. దీన్ని సరిదిద్ది, ఆయా ఎత్తిపోతల పథకాలకు జీవం పోసేందుకు ప్రభుత్వం దృష్టిపెట్టింది. అయితే అవి ప్రతిపాదనల దశ దాటకపోవడం అన్నదాతలకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది.



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం చేయడంకోసం 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ (ఏపీఐడీ) ఏర్పడింది. ఇది ప్రధానంగా ఎత్తిపోతల పథకాల ఏర్పాటు, నిర్వహణ కోసం పనిచేస్తోంది. కనీసం 50 ఎకరాల నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూముల కోసం ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించింది. ముఖ్యంగా గోదావరి, కాల్వలు, డ్రైన్ల నుంచి నీటిని ఎత్తిపోసి పంటలు పండించడానికి చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. ఇక వాటి నిర్వహణ, తూడు, డీసిల్టేషన్, చిన్నచిన్న రిపేర్లు వంటివి రైతులు చేసుకోవాలి. దీనికోసం 11 మందితో రైతు కమిటీ ఉంటుంది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి 1000 వరకూ ఏడాదికి వసూలుచేసి ఎత్తిపోతల పథకాలను మెయింటెనెన్స్ చేస్తారు. పూర్తి మరమ్మతులు వస్తే ప్రభుత్వమే బాగు చేయిస్తుంది. పదేళ్ల నుంచి పాలకులు వీటిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. నిర్వహణకు ఇబ్బంది లేకుండా కొంత సాయం అందించి చేతులు దులిపేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటికోసం పైసా విదల్చలేదు. దాంతో కొన్ని ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. మరమ్మతులు లేక ఆ ఎత్తిపోతల ఆయకట్టులో సాగు నిలిచిపోయింది.

ఎక్కడెక్కడ.. పంపింగ్ స్కీములెన్ని..

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 పంపింగ్ స్కీమ్‌లుండగా, వాటి పరిధిలో 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. దీంట్లో పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండాపోగా, మరో 20 ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. కొంతకాలం వీటిని మైక్రో ఇరిగేషన్ డెవలప్మెంట్ సంస్థ తన అధీనంలో నిర్వహించినా, ఏజెన్సీ ప్రజల్లో స్పందన లేదనే కారణంతో ఇది కూడా వదిలేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 35 స్కీమ్‌లు ఉండగా, అందులో ఆరింటింటిని మొత్తం తొలగించారు. ఇక 29 స్కీమ్‌ల కింద 55,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో కొన్ని ఎకరాలకు మాత్రమే నీటిసరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో కాటవరం, కుమారదేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, చాగల్లు బ్రాహ్మణగూడెం వంటివి మాత్రం ఓ మాదిరిగా పనిచేస్తున్నాయి. వేములవాడ -1,2, పెదపూడి, పల్లిపాలెం-1,2, పనిచేస్తున్నాయి. మిగతా ప్రాంతాల్లో రిపేర్లకు గత పదేళ్ల నుంచి పాలకులు నిధులు ఇవ్వకపో వడంతో ఎక్కడిక్కడ చతికిలపడ్డాయి. 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ వ్యవస్థ బతికించడానికి కొంత ప్రయత్నం చేసింది. కొత్త ఎత్తిపోతల పథకాలను కూడా ప్రతిపాదించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటి విషయం పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతుల చొరవ వల్ల నామమాత్రంగా కొన్ని ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ మొల్లేరు- గోవిందపురం- మల్లవరం స్కీమ్ పనులు ఇంతవరకు చేపట్టలేదు. ఇది కొత్త స్కీమ్. గతంలో 22 శాతం పని జరిగి ఆగింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో పది చిన్నఎత్తిపోతల పథకాలు ఉండగా, ఇవి పాక్షికంగా పనిచేస్తున్నాయి. అందులో కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు స్కీమ్‌లు ఉండగా అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం, రాజానగరం నియోజకవర్గంలోని కాటవరం ఉన్నాయి. ఇక్కడ మొత్తం 23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లకు రూ.4815.50 లక్షలు. నిర్వహణకు రూ.14745 లక్షలు.. మొత్తం రూ.195 కోట్ల 60 లక్షల 50 వేలతో అంచనాలు పంపించారు. కాకినాడ జిల్లాలో అత్యధికంగా 14 స్కీమ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరు మినీ, పెద్దాపురం-1, పెద్దాపురం-2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధిలోని పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలోని సోమవరం పథకాలున్నాయి. ఇక్కడ 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.122 కోట్ల 25 లక్షల 32 వేలు అంచనా వేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 పథకాలు ఉన్నాయి. అవి రాజోలు నియోజవర్గంలోని చింతలమోరి, కొత్తపేట నియోజకవర్గంలోని వసంతవాడ, ఉచ్చిలి పథకాలు. ఇక్కడ మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37 వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాల్లో 927 ఎకరాల ఆయకట్టు ఉంది. రిపేర్లు, మెయింటెనెన్స్ కోసం రూ.3 కోట్ల 48 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

● 49 స్కీమ్‌లు.. రూ.600 కోట్లు

తెలంగాణలో కాకతీయ మిషన్ మాదిరిగా ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే వీటి మరమ్మతులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మొత్తం ఎత్తిపోతల పథకాలను వదిలేసి,మెట్ట ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులతోపాటు ఐదేళ్లపాటు నిర్వహణ చేయడానికి ఓ కార్పొరేట్ సంస్థకు అప్పగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధచేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 49 ఎత్తిపోతల పథకాలకు మొత్తం రూ.600 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.

నేడు జగ్గన్నతోట ప్రభల ఉత్సవ కమిటీ భేటీ

- రాష్ట్ర పండుగగా గుర్తింపు రానున్న నేపథ్యంలో ముందస్తు సమావేశం

అంబాజీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 450ఏళ్ల చరిత్రకలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ఉత్సవానికి రాష్ట్ర పండుగగా గుర్తింపు లభిస్తుండడంతో అధికారులు ముందస్తుగానే అధికారులు, ఉత్సవ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. మొసలపల్ల పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం 4గంటలకు డివిజనల్, మండలస్థాయిఅధికారులతోపాటు ఉత్సవ కమిటీ నిర్వాహకులతో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ముఖ్యమైన సమస్యలు

అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం రూరల్ మండలాల పరిధిలోని 11 గ్రామాలకు చెందిన ఏకాదశరుద్రుల ప్రభలు ఈ ఉత్సవానికి ఊరేగింపుగా చేరుకుంటాయి. ప్రభలు వచ్చే రహదారుల అభివృద్ధితోపాటు ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ చేయాల్సి ఉంది. తీర్థంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి. లక్షలాది మంది వీక్షించే ఈ ఉత్సవంలో తాగునీరు అందించాలి. తీర్థంలో బారులు నిషేధించాలి. ప్రభలు వెళ్లే ప్రదేశాల్లో ఏ దుకాణాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం రుద్ర ప్రభలు పంటచేల నుంచి అప్పర్‌కౌశిక దాటుకుని తీర్థంలోకి వస్తాయి. ప్రభలు వచ్చే ప్రాంతాల్లో అడ్డు వచ్చే విద్యుత్‌వైర్లను తొలగించాలి. ఆ ప్రాంతంలో ఉన్న అప్పర్ కౌశికను శుభ్రం చేయించాలి. తీర్థం జరిగే ప్రాంతంలో ఫెన్సింగ్ తొలగించాలి. ఈ సమస్యలన్నింటిపై దృష్టిసారించాల్సి ఉంది.

పెట్టుబడులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయఅనుబంధ రుణాలకల్పనలో ప్రాంతీయ, భౌగోళిక పరిస్థితులను బట్టి పెట్టుబడి ఖర్చులను స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితులకు అనుగుణంగా పెంచాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సహకార బ్యాంకు సీఈవో, కమిటీ కన్వీనర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ అరటి, కొబ్బరి, వరి, మత్స్య పంటల రుణాలు, పరిమితుల నిర్ధారణ, పాడి పశువుల పెంపకం, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణకు రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ సిఫార్సులను పరిగణనలోనికి తీసుకున్నామన్నారు. జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో పలు రకాల చర్చలు జరిపి సిఫార్సులను సమీక్షించి పెంపుదల చేశామన్నారు. జిల్లాలోని కొంతమంది ప్రగతిశీల రైతులను ప్రతినిధులు సభ్యులుగా నియమించారన్నారు. పండించిన పంట, సాగు విస్తీర్ణం ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. సహకార బ్యాంకు సీఈవో పవన్‌కుమార్ మాట్లాడుతూ పాడిపరిశ్రమల రంగాలకు రుణాలు, గొర్రెలు, మేకల పెంపకానికి మూలధన పెట్టుబడుల కోసం దీర్ఘకాలిక రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి బోసుబాబు, ఉద్యాన అధికారి వీవీ రమణ, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ అధికారి మనోజ్‌కుమార్, ఎల్డీఎం కేశవవర్మ,యూపీఐ అగ్రికల్చర్ హెడ్ రవి, నాబార్డు డీడీఎం స్వామినాయుడు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు బహుమతుల అందజేత



విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందించిన కలెక్టర్

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు తాము ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ప్రతిభా పాటవాలను చాటాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు గతనెల 29న జీఎంసీ బాలయోగి స్టేడియంలో బ్యాండ్మింటన్, క్యారమ్స్, చదరంగం, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను కలెక్టర్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సామర్థ్యాలను ప్రశంసిస్తూ వారికి సమాన అవకాశాలు,గౌరవం,సంక్షేమం కల్పించాలన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సులో ప్రయాణ సౌకర్యం, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ సంస్థల్లో ప్రాతినిథ్యం కల్పిస్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందుతున్నట్టు ఆర్థిక సబ్సిడీలను ప్రభుత్వం వీరికి అందజేస్తుందన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆర్డీవో కె.మాధవి మాట్లాడారు. హౌసింగ్ ప్రాజెక్టుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌ను వీరికి కేటాయిస్తామన్నారు. డీఎస్డీవో రుద్ర, మెప్మా అధికారి పెంచలయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈవోగా నాగేశ్వరరావు



అమలాపురం,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా విద్యాశాఖాధికారిగా పి.నాగేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను డీఎస్ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఇప్పటివరకు డీఈవోగా పనిచేసిన షేక్ సలీంబాషాను బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్లకు మోక్షం

- జిల్లాలో 78 రహదారుల అభివృద్ధికి రూ.133.79 కోట్లు విడుదల
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఉత్తర్వులు జారీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఉప్పలగుప్తం మండలం కిత్తనచెరువులో రహదారికి కొలతలు వేస్తున్న దృశ్యం

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. జిల్లా పరిధిలోని 78 రహదారులకు సంబంధించి 186 కిలోమీటర్ల పొడవుగల రోడ్లకు రూ.130.79కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో రోడ్లు మంజూరయ్యాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రూ.133.79 కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిలోభాగంగా అమలాపురం నియోజకవర్గంలో 13 రోడ్లకు సంబంధించి 30.724 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.17.58కోట్లు మంజూరయ్యాయి. గన్నవరం నియోజకవర్గంలో 18 రహదారులకు 34.898 కిలోమీటర్ల పొడవైన రోడ్ల అభివృద్ధికి రూ.20.63కోట్లు, రాజోలు నియోజకవర్గంలోని 17 రహదారులకు సంబంధించి 33.748 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి కోసం రూ.23.78కోట్ల నిధులు మంజూరయ్యాయి. కొత్తపేట పరిధిలోని 9రోడ్లకు సంబంధించి 20.827 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.14.93కోట్లు, మండపేట నియోజకవర్గంలో 13 రోడ్లకు 32.705 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికోసం రూ.22.76కోట్లు, ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన నాలుగు రోడ్ల పరిధిలో 22.149 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారుల అభివృద్ధికోసం రూ.24.86కోట్ల నిధులు కేటాయించారు. రామచంద్రపురం పరిధిలోని నాలుగు రోడ్లకు చెందిన 11.072 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారుల అభివృద్ధి కోసం రూ.6.25కోట్ల నిధులు మంజూరయ్యాయి. కలెక్టర్ నుంచి పంచాయతీరాజ్‌మంత్రికి ఈఎన్‌సీ ద్వారా సకాలంలో రోడ్ల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపించడంతో జిల్లాకు అత్యధిక నిధులు సాధించుకోగలిగామని అధికారులు భావిస్తున్నారు. నిధులు మంజూరుపట్ల పీఆర్ ప్రాజెక్టుల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా ఆస్పత్రిని తక్షణమే నిర్మింపచేయాలి

- లోక్‌సభలో ఎంపీ హరీష్

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి జిల్లా ప్రభుత్వాస్పత్రిని తక్షణం నిర్మించాలని అమలాపురం ఎంపీ హరీష్ లోక్‌సభలో మంగళవారం కోరారు. కేన్సర్ డే సెంటర్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలన్నారు. జిల్లాలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ,మౌలిక సదుపాయాలు లోపించడం వల్ల గ్రామీణ, విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రామా, పాలిట్రామాసెంటర్, క్రిటికల్ కేర్ సెంటర్ లేకపోవడం వల్ల క్లిష్టమైన కేసులకు సకాలంలో వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియా వ్యాప్తిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కీటకాలవ్యాప్తిపై వైద్యాధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ బ్యాక్టీరియా పంట పొలాలు, తేమఉన్న ప్రదేశాల్లో వ్యాప్తి చెందుతుందని, చీడపురుగునుంచి లార్వాలు వ్యాప్తి చెందిన కీటకాలను జనిస్తాయన్నారు. ఇది కుట్టిన వెంటనే ఐదుసార్లు జ్వరం రావడంతోపాటు తలనొప్పి, బద్ధకంగా ఉండడం వంటి లక్షణాలతోపాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. కుట్టినచోట నల్లని మచ్చ ఏర్పడుతుందని, సాధారణ యాంటీ వైరస్ మందుల ద్వారా నివారించుకోవచ్చునని అన్నారు.వ్యక్తిగత దుస్తులు ఒంటి నిండా ధరించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ ప్రతాప్, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ తిరుమలరావు, అరుణకుమారి, శ్రీనివాస్, జాన్‌విల్సన్ పాల్గొన్నారు.



పరీక్షల సమయం దగ్గరపడుతోంది. పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా విద్యా శాఖ వంద రోజుల ప్రణాళికతో వారిని సంసిద్ధం చేస్తోంది. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడనున్నారు. కేంద్ర మానవవనరుల శాఖ ఏటా 'పరీక్షా పే' చర్చ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?, విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని ఎలా అధిగమించాలి? పరీక్షల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి వంటి విషయాలపై ఈ 'పరీక్షా పే' చర్చ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతుల విద్యార్థులు అర్హులు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడతారు. వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు.

హలో పీఎం జీ...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పరీక్షా పే చర్చ 2018 ఫిబ్రవరి 16న ఢిల్లీలో ప్రారంభమైంది. అప్పట్లో తాల్కతోరా స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నేరుగా ప్రధాని మోదీతో సంభాషించారు. ఇప్పుడు కూడా విద్యార్థులు తమ ప్రశ్నలను ప్రధాన మంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాలలోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలకు కూడా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అవకాశం కల్పించింది. ప్రస్తుతం తొమ్మిదో ఎడిషన్‌కు సన్నద్ధమవుతోంది.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 'పరీక్షా పే' చర్చ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు https://innovateindia.mygov.in క్లిక్ చేయాలి. ఎంటర్ కాగానే క్లిక్ ఏజ్ స్టూడెంట్, టీచర్, పేరెంట్స్ అనే లాగిన్స్ కనిపిస్తాయి. వాటిలోకి ఎంటర్ కాగానే మీ మొబైల్ నెంబరు లేదా జీ-మెయిల్ ఖాతాను పూర్తిచేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. నేరుగా ఫోను నంబరు, జీ-మెయిల్ లేని స్టూడెంట్స్ టీచర్స్ లాగిన్ ద్వారా ఎంటర్ కావొచ్చు. ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. తర్వాత థీమ్‌ను ఎంచుకుని 500 అక్షరాలలోపు వివరించాలి. అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షా పే చర్చలో పాల్గొనేలా డీవైఈవోలు, ఎంఈవోలు కృషి చేయాలి. చర్చకు ఎంపికైన సుమారు రెండువేల మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్లు అందజేయనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 11 తుది గడువు.

పరీక్షా పే చర్చలో పాల్గొనే విద్యార్థులు ఎవరైతే మంచి ప్రశ్నలు వేస్తారో వారిని అర్హులుగా నిర్ణయిస్తారు. విజేతలు నేరుగా ప్రధాని మోదీని కలిసే అవకాశం ఉంటుంది. ప్రతి విజేతకు ప్రత్యేక కిట్, ప్రత్యేకంగా రూపొందించిన ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్ కూడా ఇస్తారు.





- విద్యార్థులకు ప్రధాని మోదీతో మాట్లాడే అవకాశం
- 'పరీక్షా పే' చర్చ పేరుతో త్వరలో కార్యక్రమ నిర్వహణ
- ఈ నెల ఒకటిన మొదలైన ఆన్‌లైన్ నమోదు
- జనవరి 11తో ముగియనున్న గడువు



చక్కని అవకాశం

పి.రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా



ప్రధాని నరేంద్ర మోదీతో విద్యార్థులు మాట్లాడే అరుదైన కార్యక్రమమిది. పరీక్షా పే చర్చలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 6-12 తరగతుల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఇది చక్కని అవకాశం. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా కృషి చేయాలి.

క్రీడా సంరంభం

- కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నేటి నుంచి సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నమెంటు
- నాలుగు పూల్స్‌గా విభజన
- కాకినాడ జిల్లాలో మూడుచోట్ల ఆరు కోర్టుల్లో నిర్వహణ
- ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 138 జట్లు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్న ప్రభుత్వ విప్ గణబాబు



జేఎన్టీయూ మైదానంలో ముస్తాబవుతున్న వేదిక

జేఎన్టీయూకే, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) న్యూఢిల్లీ సహకారంతో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నమెంటులో సుమారు 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. నాలుగు పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఎ, బి-జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సి-అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డి-సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయి. ఆరు రాష్ట్రాలకు చెందిన 1,960 మంది క్రీడాకారులు, 300 మంది కోచ్‌లు, మేనేజర్లు, 60 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారత స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాలీబాల్ టోర్నమెంటును ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారు. విశిష్ట అతిథులుగా అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు పి.వెంకటరమణ, ఏఐయూ పరిశీలకుడు డాక్టర్ ఈ.త్రిమూర్తులు, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ పాల్గొంటారు.



వివరాలు వెల్లడిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

విజేత, రన్నరప్, 3, 4 స్థానాల్లో నిలిచే జట్లకు బహుమతులు అందజేస్తారు. లీగ్ మ్యాచ్‌ల్లో అర్హత సాధించిన జట్లకు జేఎన్టీయూ మైదానంలో పోటీలు నిర్వహిస్తారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొంటాయని శ్యామ్‌కుమార్ తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంటుకు జేఎన్టీయూకే వీసీ అధ్యక్షత వహించనుండగా డైరెక్టర్లు కృష్ణమోహన్, రాము కార్యనిర్వాహక కమిటీ అధికారులుగా వ్యవహరిస్తారని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంటు కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ జీపీ రాజు వ్యవహరిస్తున్నారు.

● ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు చెందిన 138 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. వాలీబాల్ మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు నాలుగు కోర్టుల్లో జరుగుతాయి. పోటీలు ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయి. జేఎన్టీయూకే మైదానంలోని ఫ్లడ్‌లైట్ కోర్టులు 1, 2, రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోని కోర్టులు 3, 4, సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని కోర్టులు 5, 6ల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.



టోర్నీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు





కాకినాడ జేఎన్టీయూ మైదానంలో సిద్ధం చేసిన వాలీబాల్ కోర్టు, క్రీడాభిమానులు కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటుచేసిన గ్యాలరీ

గ్రామీణ భారత్ ఉన్నతికి పీఎంజీఎస్‌వై దోహదం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

- కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
- ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన 25 వసంతాల వేడుకలు

జేఎన్టీయూకే, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి గ్రామీణ భారత్ ఉన్నతికి ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన(పీఎంజీఎస్‌వై) ఎంతగానో ఉపయోగపడిందని కాకినాడ కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్ అన్నారు.కాకినాడ జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ జేఎన్టీయూ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించే సాంకేతిక సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. పీఎంజీఎస్‌వై ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తు న్న ఈ సెమినార్‌ను కలెక్టర్‌తోపాటు జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, పీఆర్ చీఫ్ ఇంజనీర్ బి.బాలునాయక్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభించిన రోడ్లను, ఇతర ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి పరిశీలించాలన్నారు.వీసీ ప్రసాద్ మాట్లాడుతూ తాను వరంగల్ ఆర్ఈసీగా ఉండగా రాష్ట్ర సాంకేతిక ఏజెన్సీ ద్వారా వేల కిలోమీటర్లమేర గ్రామీణరోడ్లకు సాంకేతిక సహకారం అందించా మన్నారు. బాలునాయక్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి దేశ ప్రధాని వాజ్‌పేయి పుట్టినరోజు సందర్భంగా పీఎంజీఎస్‌వై ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఏవీఎస్ శ్రీనివాస్, పి.రామకృష్ణ, బాలకృష్ణ, పృథ్వీరాజ్, ఏపీపీఆర్డీ ఇంజనీర్లసంఘ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

సామర్లకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టంపై శిక్షణ తరగతులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 80మంది ఎంపీడీవోలు హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ మాట్లాడు తూ షెడ్యూల్డు ప్రాంతాల్లో పరిపాలన మరింత మెరుగుపడేలా శిక్షణను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు.ఎంపీడీవో సుశీల, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, నీహారిక, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవ పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం గోపూజ, గోప్రదక్షిణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, స్వామివారికి స్నపనం, అకల్మష హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో పుట్టమట్టిని తీసుకొచ్చారు. యాగశాలలో అంకురార్పణ, వాస్తుపూజ, శాంతిహోమం నిర్వహించారు.ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు,ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వన్ నేషన్-వన్ పోర్ట్ ప్రోసెస్ అమలుతో
పోర్టు రంగంలో భారీ సంస్కరణలు

రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వన్ నేషన్ వన్ పోర్ట్ ప్రోసెస్(ఓఎన్ఓపీ) అమ లుతో పోర్టు రంగంలో భారీ సంస్కరణలు జరగనున్నాయని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. ఈ అంశంపై మంగళవారం రాజ్యసభలో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర పో ర్టులు, షిప్పింగ్, జల మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ స్పందించారు. దేశవ్యాప్తంగా పోర్టుల పనితీరు, డిజిటల్ వ్యవస్థలు, నియంత్రణ ప్రక్రియలను ఏకరీతిలో అమలు చేయడమే ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఓఎన్ఓపీ అభివృద్ధి, అమలుపై ఆయన స్పష్టతనిచ్చారు.ఈ చర్యలతో అన్ని పోర్టుల్లో సమాన ప్రామాణీకరణను అందించడంతో పాటు లాజిస్టిక్స్ రంగంలో పారదర్శకతను పెంచుతాయన్నారు. ముఖ్యంగా నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్(సాగర్ సేతు)ను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. అన్ని పోర్టుల్లో షిప్పింగ్ సంబంధిత సమాచారాన్ని ఎలక్ట్రానిక్స్‌గా సజావుగా సమర్పించడం, ప్రోసెసింగ్ చేయడం కోసం ఈ వేదికను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఈ వేదికపై కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వంటి కీలక విభాగాలను ఒకే చోట అనుసంధానిస్తామని చెప్పారు.ఈ సంస్కరణలు పారదర్శకంగా, సమానంగా అమలవుతాయని, దేశంలోని ప్రతి పోర్టుకు ఆంధ్రప్రదేశ్ పోర్టులను కలుపుతూ ఈ ఫ్రేమ్ వర్క్ కొనసాగుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ విధానం వల్ల పోర్టు మౌలిక వసతుల్లో, డిజిటల్ సేవల్లో, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలో ఏకరూపత నెలకొని రాష్ట్ర పోర్టులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

మడ అడవులతో మానవాళి
మనుగడకు రక్షణ

కోరింగ ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్



మడ అడవుల విశిష్టతను వివరిస్తున్న రేంజర్ వరప్రసాద్

తాళ్లరేవు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు మడ అడవులు రక్షణ గోడలా నిలుస్తున్నాయని కోరింగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని కోరింగ అభయారణ్యాన్ని రాజమహేంద్రవరం అటవీ శాఖలో శిక్షణ పొందుతున్న 12, 13 బ్యాచ్‌ల ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవో ట్రైనీలు సందర్శించారు. వారికి మడ అడవుల విశిష్టత, వన్యప్రాణుల సంరక్షణ, సముద్ర తాబేళ్ల, సీబీఈటీ ప్రాముఖ్యతలను ఎఫ్‌బీవో మహేష్ వివరించారు. కార్యక్రమంలో అటవీ అకాడమీ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు, ఎఫ్‌బీవోలు మహేష్, డి.మహేష్‌బాబు, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు



ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజు నియమితులయ్యారు. ఆలయానికి 17 మంది సభ్యులతో పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సిఫార్సు మేరకు ఆత్రేయపురం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రాజును చైర్మన్‌గా నియమించారు. నియోజకవర్గానికి చెందిన 10 మంది ధర్మకర్తలను ప్రభుత్వం నియమించగా మరో ఏడుగురిని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణాకు చెందిన ఓ వ్యక్తికి స్థానం కల్పించారు. ధర్మకర్తలుగా చలుమూరి రాంబాబు,గంగవరపు పద్మావతి,కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరెళ్ళ సరిత, యేపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి,కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్యకుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోశాల అప్పలనర్స, అర్చక ఎక్స్‌అఫీషియోగా వాడపల్లి సుందర శేషావతారం నియమితులయ్యారు. నూతన పాలక మండలి త్వరలోనే కొలువుదీరనుంది.

డెల్టా కాలువలు, డ్రెయిన్లపై లైడార్ సర్వే

మే నెలలోపు రిపోర్టు.. రూ.13.4 కోట్లతో ఐఐసీటీతో ఒప్పందం: మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డెల్టా పంటను ముంపు బారి నుంచి తప్పించే ప్రయత్నాలను ప్రభుత్వం వెతకడం మొదలు పెట్టింది. కాలువల్లో పూడిక, డ్రెయిన్లు సరిగ్గా లేకపోవడం వల్లే ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఏటా పంట ముంపునకు గురవుతుందని ఆలోచనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో మంగళవారం ఇరిగేషన్ అధికారుల సమీక్ష జరిగింది.ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, డెల్టా సీఈ శేషబాబు, ఎస్ఈ గోపీనాథ్, ఏలూరు ఎస్ఈ దేవప్రసాద్, ఈఈలు తదితరులతో ఈ సమీక్ష జరిగింది. ఈ నెలలోనే సర్వే మొదలవుతుందని, ప్రధాన కాలువలు,డ్రెయిన్లలో పూడిక ఏ స్థాయిలో ఉంది. వాటి పరిస్థితి ఏంటనేది మ్యాప్‌లతో సహా ఈ సర్వే చేయనున్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలలో మొత్తం ఈ సర్వే జరుగుతుంది ఇరిగేషన్ అధికారుల సహకారంతో ఐఐసీటీ ఈ సర్వే నిర్వహించనుంది. కాగా డ్రిప్ పథకం కింద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి మరమ్మతులకు కేటా యించిన రూ.150 కోట్లతో ఎప్పుడు పనులు మొదలపెడతారనేది సమావేశంలో నిర్ణయించలేదు. ప్రస్తుతం సర్వే పైనే ప్రధాన దృష్టి పెట్టడం గమనార్హం.

12న అక్నూ పీజీ క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో లింగ గుర్తింపులు, అధికారం, ప్రదర్శన, ప్రాతినిధ్యం వంటి సామాజిక సాంస్కృతిక అంశాలపై ఈ నెల 12న అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచడమే కాకుండా అంతర్జాతీయ స్థాయి ఆలోచనలను అవగాహన చేసుకునేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. పలువురు అంతర్జాతీయ నిపుణులు ప్రసంగించనున్న ఈ సదస్సును విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'అన్నవరం' ఈవోగా వేంద్ర త్రినాథరావు

ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ


త్రినాథరావు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా వేంద్ర త్రినాథరావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు ఏడాది కాలపరిమితితో రెవెన్యూ విభాగం నుంచి డిప్యూటేషన్‌పై గతేడాది డిసెంబరు 13న బాధ్యతలు స్వీకరించారు. మరో 6నెలల పొడిగింపు కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఏడాదికాలంలో దేవస్థానం పాలనపై అనేక విమర్శలు రావడంతో బదిలీ అనివార్యమయింది. నూతన ఈవో వేంద్ర త్రినాథరావు ప్రస్తుతం రాజమండ్రి రీజినల్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా అన్నవరం దేవస్థానం బాధ్యతలు అప్పగించారు. గతంలో ఈయన అన్నవరం దేవస్థానంలో 2పర్యాయాలు ఈవోగా పనిచేయడం, ఈ ఏడాది కార్తీకమాసంలో ప్రత్యేక ఉత్సవాలైన గిరిప్రదక్షిణ, తదితర వాటికి ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. సౌమ్యుడిగా పేరున్న త్రినాథరావు నియామకంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ రత్నావతి కన్నుమూత

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం


బొండా రత్నావతి (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ బొండా రత్నావతి (80) వయోభారంతో కన్నుమూశారు. తుని పట్టణంలోని సాయినగర్‌లో సోమవారం రాత్రి ఆమె తుదిశ్వాస విడిచారు. టీడీపీ నుంచి గెలుపొందిన ఆమె 1987 నుంచి 1992 వరకు తుని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందించారు. టీడీపీ ఆవిర్భవించిన తొలినాళ్లలో ఆ పార్టీ నుంచి గెలుపొంది చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించారు. మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన పలు మార్పులు ఆమె హయాంలో తీసుకున్న నిర్ణయాలే. పట్టణ అభివృద్ధికి రత్నావతి విశేష కృషి చేశారని అప్పటి తరానికి చెందిన పలువురు తెలిపారు. రత్నావతి మృతికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం వ్యక్తం చేశారు.

బంధువులమని చెప్పి తీసుకెళ్లి.. బాలికపై అత్యాచారం

నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ముమ్మిడివరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బంధువులమని చెప్పి బాలికను బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరు అరెస్ట్ అయ్యారు. ఈ వివరాలను మంగళవారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ వెల్లడించారు. నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు.

అసలేం జరిగిందంటే..?

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ముమ్మిడివరం మండలం ఠాణేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వడ్డివారిపేటకు చెందిన మోకా గిరిబాబు ఈనెల 3న గురుకుల పాఠశాలకు వచ్చాడు. బాబాయిని అని చెప్పి అతడితో పాటు వరసకు మరదలు అయిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ సాయంతో బాలికను ఆసుపత్రికి తీసుకెళ్తానని పాఠశాల యాజమాన్యాన్ని అనుమతి కోరారు. వారు అంగీకరించకపోవడంతో తాము రక్త బంధువులమని మరో మహిళతో చెప్పించి నమ్మబలికారు. బాలికకు ఉన్న అనారోగ్య సమస్య దృష్ట్యా వారితో బయటికి పంపించారు. వారు మోటారుసైకిల్‌పై బయలుదేరారు. అర్చనాదేవిని గిరిబాబు ముమ్మిడివరంలో వదిలి బాలికను అక్కడి నుంచి తీసుకుపోయాడు. అయితే ఆరోజు సాయంత్రానికి బాలిక తిరిగి రాకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం గిరిబాబు బాలికను పాఠశాల వద్దకు తిరిగి అప్పచెప్పగా యాజమాన్యం విషయాన్ని పోలీసులకు తెలియచేయడంతో గిరిబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆ బాలికను మహిళా ఎస్ఐతో విచారించగా పలు విషయాలు వెల్లడయ్యాయని డీఎస్పీ తెలిపారు.

లాడ్జికి తీసుకెళ్లి..

బాలికను గురుకుల పాఠశాల నుంచి బయటికి తీసుకువెళ్లిన గిరిబాబు ఆ రోజు తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం తీసుకెళ్లి కొంతసేపు గడిపి అక్కడి నుంచి అమలాపురంలోని శ్రీగణపతి లాడ్జికి తీసుకెళ్లి గుమస్తాగా పనిచేస్తున్న నాగవరపు వెంకటరమణ అలియాస్ బద్రికి కొంతసొమ్ములు ఆశగా చూపి గది అద్దెకు తీసుకుని ఆ రాత్రి ఆ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసినట్టు విచారణలో తేలింది. గిరిబాబు ఆ బాలిక ఇంటి పక్కనే నివాసం ఉంటున్నాడు. తల్లి గల్ఫ్‌లో ఉండడం, తండ్రి పనుల నిమిత్తం బెంగుళూరులో ఉండడంతో బాలిక నాన్నమ్మ, తాతయ్యల వద్దే ఉంటుంది. దీంతో బాలిక కుటుంబంతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. ఆమె సెలవులకు వచ్చినప్పుడు పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలికకు అనారోగ్యం దృష్ట్యా వైద్యం కోసం గిరిబాబును ఆమెతో ఆసుపత్రికి తోడుగా పంపేవారని, దీన్ని గిరిబాబు ఆసరాగా తీసుకునేవాడు. అత్యాచారానికి పాల్పడిన గిరిబాబు, అతడికి సహకరించిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ, లాడ్జి గుమస్తా నాగవరపు వెంకటరమణపై పోక్సో చట్టం కింద కిడ్నాప్, అత్యాచారం కేసులు నమోదు చేసి సోమవారం సాయంత్రం ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం ముమ్మిడివరం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ టీచర్‌పై చర్యలు

గురుకుల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం.. అత్యాచారం సంఘటనపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదను సస్పెండ్ చేయగా కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేస్తున్న మేథమెటిక్స్ టీచరు, హౌస్ టీచరు డి.లోవకుమారిని విధుల నుంచి తొలగిస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఉత్తర్వులు విడుదల చేసింది.

విద్యార్థినుల ధర్నా

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, హౌస్ టీచర్ డి.లోవకుమారిని విధుల తొలగింపు నుంచి రద్దు చేయాలని కోరుతూ ఆ పాఠశాల విద్యార్థినులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారికి పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సంఘీభావం తెలిపారు. పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న ప్రిన్సిపాల్‌ను వెళ్లిపోరాదంటూ అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్ తమను పిల్లల్లా చూసుకుంటున్నారని, ఆమెను సస్పెండ్ చేయడం తగదని నినాదాలు చేశారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆందోళన విరమించాలని విద్యార్థులకు ఎంత నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. డీసీవో వచ్చి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సాంఘిక సంక్షేమ జిల్లా కోఆర్డినేటర్ జి.రాజకుమారి వచ్చి విద్యార్థినులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ సస్పెన్షన్ విషయం, హౌస్ టీచర్ తొలగింపు రద్దు విషయం ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని ఎత్తివేసేలా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


ధర్నా నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

తూకాల్లో తేడాలు వాస్తవమే..

చేబ్రోలులో 4 గంటల పాటు రైతుల ధర్నా
పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు
ఎలక్ట్రానిక్ కాటా సీజ్


కాటాను పరిశీలిస్తున్న అధికారి సహిద్ సలీం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూకాల్లో వస్తున్న తేడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు మంగళవారం రైతులు ఆందోళన కొనసాగించారు. తేడాలు వాస్తవేమనని తేలడంతో పట్టుపరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేస్తున్నట్టు తూనికలు, కొలతలు శాఖ అధికారులు ప్రకటించారు. చేబ్రోలు పట్టు మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాలోని తూకంలో తేడాలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు మంగళవారం 4 గంటల పాటు ధర్నా నిర్వహించారు. తూకంలో తేడాలతో మూడేళ్లుగా తాము భారీగా నష్టపోయామని, పరిహారం అందజేయాలని, బాధ్యులైన పట్టు పరిశ్రమశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు కనీసం రూ.3-5లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు. 100కిలోలకు 2.68కిలోలకు పైగా తక్కువ వచ్చిందని చెప్పారు. పట్టు పరిశ్రమశాఖ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయి రైతులకు నష్టపోయేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను సస్పెండ్ చేసి తాము నష్టపోయిన సొమ్ములను పరిహారంగా ఇప్పించాలని డిమాండ్ చేశారు.

రైతులతో చర్చలు

పట్టు పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ గీతారాణి సెరీకల్చర్ కార్యాలయానికి చేరుకుని రైతులను చర్చలకు ఆహ్వానించారు. అయితే డీడీతో చర్చలు జరిపేందుకు రైతులు నిరాకరించారు. దీనితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ చేబ్రోలు చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. పట్టు పరిశ్రమల శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని, మూడేళ్లుగా జరిగిన నష్టాన్ని తమకు పరిహారంగా అందజేయాలని, ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

తూకం-మోసం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సహిద్ సలీం చేబ్రోలు చేరుకుని ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేశారు. 20కిలోలకు అరకిలో, 50కిలోలుకు 1.340కిలోలు, 100 కిలోలకు 2.780కిలోల తేడాను గమనించినట్టు సలీం తెలిపారు. తాను నాలుగేళ్లుగా ఇదే జిల్లాలో పనిచేస్తున్నానని, తమ శాఖ రికార్డుల్లో చేబ్రోలు పట్టు మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాటా ఉన్నట్లు లేదా సీళ్లు వేయించినట్లు గాని లేదని చెప్పారు. పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.


పట్టు రైతులతో చర్చలు జరుపుతున్న తహశీల్దారు, ఎస్ఐ

త్రుటిలో తప్పిన ప్రమాదం!

ప్రైవేట్ స్కూలు బస్సు బోల్తా
స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డ 40మంది చిన్నారులు
తీపర్రు వద్ద ఘటన



బోల్తా పడిన స్కూలు బస్సు, ప్రమాదంలో గాయపడిన మహిళ

పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా కొట్టగా విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా తాడిపర్రు జ్యోతి స్కూలుకు చెందిన బస్సు కానూరు అగ్రహారం ఉసులుమర్రులో విద్యార్థులను ఎక్కించుకుని తీపర్రులో పిల్లలను ఎక్కించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గోదావరి ఏటిగట్టుపై మలుపు తిప్పుకునేందుకు వచ్చింది. మలుపు తిప్పే క్రమంలో గోదావరి వైపు అప్రోచ్ రోడ్డు దాటి రివర్స్‌లో కొద్దిమేర దిగింది. దీంతో బ్రేకులు ఫెయిలై బస్సు ముందుకు రాకుండా వెనకకు కదిలింది. దీంతో డ్రైవర్ కొద్దిమేర స్టీరింగ్‌ను కంట్రోల్ చేసినప్పటికి అప్రోచ్ రోడ్డు సగంపైగా దూరం వెళ్లిన బస్సు అనంతరం పక్కకు తిరగబడింది. సుమారు 40మంది పిల్లలు భయంతో కేకలు వేశారు. బస్సు ముందుభాగంలోని అద్దం ఊడిపడడంతో అందులో నుంచి పిల్లలందరూ స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆయాగా పనిచేస్తున్న మహిళకు కూడా గాయాలయ్యాయి. గాయాలైనవారికి స్థానికులు సపర్యలు చేశారు. సంఘటన తెలిసిన వెంటనే పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు సంఘటనా స్థలానికి వచ్చారు. కొంతమందిని తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తీపర్రుకు చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కుందుల భూపతిరావు, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర ఘటనా స్థలంలో సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బస్సులను తిప్పుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన చెందారు.


విద్యార్థులను ఊరడిస్తున్న స్థానికులు

మంత్రి దుర్గేష్ ఆరా

ఈ ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. స్థానిక నాయకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పాఠశాల యాజమాన్యం, అధికారులతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులకు తక్షణం వైద్య సదుపాయం అందించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బస్సులు లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్కూలు యాజమాన్యాలను హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా లోపాలను గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు.

తిమ్మాపురంలో ఉద్రిక్తత

భవనం ఖాళీ చేయించేందుకు భారీగా పోలీసుల మొహరింపు


పోలీసుల పహారా నడుమ ఇల్లు ఖాళీ చేయిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి రుణం తీసుకున్న వ్యక్తులు సకాలంలో బాకీ చెల్లించకపోవడంతో సదరు స్థిరాస్తిని స్వాధీనం చేసుకునే క్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, బాకీదారులకు మధ్య ఏర్పడిన వాగ్వాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసిన సంఘటన మంగళవారం కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో జరిగింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు.. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీసులు రంగంలోకి దిగి సదరు స్థిరాస్థి బ్యాంకుకి స్వాధీనం చేసేందుకు కృషి చేశారు. యూనియన్ బ్యాంకు అధికారులు మెయిన్ గేటుకి అంటించిన ఉత్తర్వుల మేరకు.. తిమ్మాపురం మెయిన్‌రోడ్డులో పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తికి జీ ప్లస్ త్రీ భవనం ఉంది. ఈ ఆస్తిని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఆఫ్ మెస్సర్స్ గౌతమి సురేష్ రైస్ ఇండస్ట్రీస్ ద్వారా తాకట్టు పెట్టి రుణం పొందారు. సకాలంలో రుణాన్ని వెనక్కి బ్యాంకుకి చెల్లించకపోవడంతో బ్యాంకు నిబంధనల మేరకు సదరు ఆస్థిని 28-4-2023, 30-5-2023లో ఈ వేలం పాట నిర్వ హించారు. మెస్సర్స్ సీ ప్రైడ్ మేనేజిమెంట్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ భవనాన్ని సుమారు రూ.1.15 కోట్లకు ఈ ఆక్షన్‌లో పాడుకుంది. 2023-24, 2024-25, 2025-26లో 12 మే 2025లో భవనం లోపల వస్తువులు, ఇతర పరికరాలు ఖాళీ చేసి భవనాన్ని అప్ప గించాలని 9 మే 2025లో హైకోర్టు ఫైనల్ తీర్పు నిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి భవనం స్వాధీనానికి బ్యాంకు అధికారులు రావడం, సదరు రుణగ్రహీతకు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం జరుగుతుంది. దీంతో భవనాన్ని ఖాళీ చేయించి అప్పగించాలని ఈ వేలంలో దక్కించుకున్న కంపెనీ ఉన్నత అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు సిఫారసు చేయించడంతో ఎట్టకేలకు మంగళవారం ఉదయం తహశీల్దార్ కుమారి, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, బ్యాంకు అధికారులు తిమ్మాపురం చేరుకున్నారు. భవనంలో 3 అంతస్తుల్లో నుంచి సామాన్లు తొలగించే ప్రక్రియను అడ్డుకున్నారు. భారీగా పోలీసులు,ప్రత్యేక రిజర్వు బలగాలు చేరుకుని స్థానికులను పంపించివేశారు. సామాన్లు తొలగించేందుకు సైతం వాహనాలను రాకుండా అడ్డుకోవడంతో పోలీసులు పహారా ద్వారా సామాన్లు తొలగించి, వాటిని బ్యాంకుకి తరలించారు.

'అయినవిల్లి' ఆదాయం రూ.46.30 లక్షలు

అయినవిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. 91 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.45,07,994, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,22,245 వెరసి మొత్తం రూ.46,30,239 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 219.9 గ్రాముల వెండి, 4.2 గ్రాముల బంగారం, 20 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని ఆయన చెప్పారు.

సత్తా చాటిన తుని యువకుడు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం


సర్టిఫికెట్లతో సాయి, చిన్న కుండల తయారీ వీల్



తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కాకినాడ జిల్లా తునికి చెందిన యువకుడు తిరుమలసేడి సాయి స్థానం సాధించాడు. ఇటీవల అతడు తయారుచేసిన అతి చిన్న మోటార్ వీల్ (ద స్మాలెస్ట్ మోటరైజ్డ్ పోటరీ వీల్) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ మేరకు సాయికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందింది. అతి చిన్న కుండలు తయారు చేసే మోటార్ వీల్ తయారు చేసి మరోసారి గిన్నిస్ రికార్డ్సులోఅతడు స్థానం సాధించాడు.

వేడుక ఇంట్లో శోకం..

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


వీరమణి (ఫైల్)

శంఖవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలుము కుంది. మహిళను కరెంటు తీగ రూపంలో మృత్యువు కబళించింది. బాధకరమైన ఈ ఘటన కాకినాడ జిల్లా కత్తిపూడిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిశెట్టి వీరమణి (35) తన అక్క కుమార్తె రజస్వల వేడుకను తన ఇంట్లో చేద్దామని ఏర్పాటు చేసుకుంది. బుధవారం వేడుక చేసేందుకు అన్ని సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం వీరమణి లైట్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలి విలవిలలాడింది. ఆమెను స్థానికుల సహాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలపడంతో వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలముకుంది. వీరమణికి భర్త గనిశెట్టి చినవెంకటరమణ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి...

ఉప్పలగుప్తం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.కొత్తపల్లిలో ఆక్వా చెరువుల వద్ద పనిచేస్తున్న చల్లపల్లి పంచాయతీ వర్రేపేటకు చెందిన బత్తుల వెంకట్రావు (38) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకట ప్రసన్నలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బావిలో పడి వృద్ధుడు...

పెద్దాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో పడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో మంగళవారం జరిగింది. గ్రామంలో కిత్తయ్య చెరువు సమీపంలో ఉన్న బావి వద్దకు బహిర్భూమికి కావూరి బీమయ్య (75) వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడిపోయాడు. గత 3 రోజుల నుంచి బీమయ్య కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో పోలీసులకు సమచారం అందించారు. వారు మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేశారు.

కాకినాడలో పట్టపగలు హత్య

చెప్పులు కుట్టుకునే కార్మికుడిని చంపి పరారైన ఆటోడ్రైవర్
పట్టుకున్న పోలీసులు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్


సత్యన్నారాయణ మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెప్పులు కుట్టుకునే చిరు కార్మికుడిని ఆటో డ్రైవర్ చేసిన సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కీర్తి సత్యన్నారాయణ (45) వ్యక్తిగత కారణాలతో భార్య, బిడ్డలను వదిలివేసి 10 ఏళ్ల క్రితం కాకినాడ వచ్చేశాడు. స్థానిక రేచర్లపేటకు చెందిన రాళ్ళ మేరీ అనే మహిళతో అతడికి పరిచయం ఏర్పడి అదికాస్తా సహజీవనానికి దారితీసింది. ఈ క్రమంలో సత్యన్నారాయణ సినిమా రోడ్డులోని సంతచెరువు కూడలిలో కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వారిద్దరూ మద్యానికి బానిస కావడంతో రోజు సాయంత్రం పూటుగా మద్యం తాగేవారు. ఈ నేపథ్యంలో సత్యన్నారాయణ సోమవారం రాత్రి మద్యం తాగి దుమ్ములపేటకు చెందిన ఆటో డ్రైవర్ అత్తిలి రంగాను అతడి తల్లిని దూషిస్తూ కారణం లేకుండా వాగ్వివాదానికి దిగా డు. అనంతరం గొడవ సద్దుమణిగింది. అయితే మంగళవారం మధ్యాహ్నం సత్యన్నారాయణ చెప్పులు కుట్టే పనిలో నిమగ్నమై ఉండగా ఆటో డ్రైవర్ రం గా అక్కడికి మద్యం తాగి వచ్చి తన తల్లిని ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దానికి సత్యన్నారాయణ ఆ విషయం గుర్తులేదని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రంగా కోపోద్రిక్తుడై చెప్పులుకుట్టేందుకు వినియోగించే పదునైన రంపిని సత్యన్నారాయణ గుండెల్లో దింపి అక్కడ నుంచి పరారయ్యాడు. సత్యన్నారాయణ తీవ్ర రక్తస్రావంతో పరిగెడుతూ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కుప్పకూలిపోయాడు. అది గమనించిన పోలీసులు క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్ సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ రంగంలోకి దిగి నిందితుడి వేలి ముద్రలు సేకరించింది. హత్య జరిగిన మూడు గంటల్లోనే నిందితుడు రంగాను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ కె.సత్యన్నారాయణ తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ మోటార్లలో కాపర్ వైర్ల చోరీ

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాచగొంపల్లి, గౌరిదేవిపేట గ్రామాల్లో గోదావరి ఒడ్డున రైతులు వినియోగించే 10 హెచ్‌పీ మోటార్లలోని కాపర్ వైర్ల (త్రీకోరు)ను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏకకాలంలో ఈ రెండు గ్రామాల్లోని గోదావరి ఒడ్డున పంటల నీటితడుల కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న 20 మోటార్లలోని కాపర్ వైర్లను కట్ చేసుకుని వెళ్లారు. ఒక్క మోటారులో రూ.5వేల విలువైన కాపర్ వైరు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వారం క్రితం ఇదే తరహాలో నెల్లిపాక, చోడవరం గ్రామాల్లోని గోదావరి నదీ ఒడ్డున రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లలోని కాపర్ వైర్లను కూడా చోరీ చేశారు. నెల్లిపాకలో 7 మోటార్లు, చోడవరంలోని 3 మోటార్లలోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. దీంతో నెల్లిపాక రైతులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కాట్రేనికోన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ కొత్తపాలెనికి చెందిన మేడ సత్యం (55) సోమవారం రాత్రి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించాడు. అతడి మృతదేహం మంగళవారం ఉదయం గోదావరి పాయలో తేలియాడుతుండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నాగవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తునిలో దొంగల హల్‌చల్

ఫిజియోథెరపి సెంటర్‌లో నగదుతో పాటు పార్కు చేసిన బైక్ చోరీ

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణంలో ఎంపీపీ బొప్పన రాముకు చెందిన ఫిజియోథెరపి సెంటర్‌లో సోమవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఆసుపత్రి గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఇద్దరు రూ.30వేల నగదు అపహరించారు. అలాగే ఫిజియోథెరపి సెంటర్ సమీపంలో ఉన్న బిల్డింగ్ వద్ద పార్కు చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో తుని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పారావు ఈనెల 5న హత్యకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి కుక్ల రాజబాబు, నాగేశ్వరరావు నిందితులుగా ఉన్నారు. రాజబాబును సోమవారం జగ్గంపేట మండలం రామవరం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగేశ్వరావు కోసం పోలీసు బృందాలు గాలించగా మంగళవారం జగ్గంపేట గ్రామ శివారున మోడల్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్నట్టు గమనించి అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐసతీష్‌ను డీఎస్పీ అభినందించారు.


నాగేశ్వరరావును అరెస్టు చేసిన పోలీసులు

అమలాపురం

రోడ్డు ఆధునికీకరణకు రూ.3.50కోట్లు

ఉప్పలగుప్తం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి- ఉప్పూడి రహదారికి ప్రభుత్వం మోక్షం కల్పించింది. సన్నవిల్లి నుంచి 5.700 కిమీ మేర రహదారిని ఆధునికీకరించేందుకు రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. ఏపీఆర్ఆర్ఎస్పీ పథకంలో ఈ నిధులు పంచాయతీరాజ్ శాఖ మంజూరు చేసినట్టు ప్రకటన వెలువడింది.

దివ్యాంగులకు ప్రభుత్వ ప్రోత్సాహం

అంతర్వేది, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ప్రోత్సాహం అందిస్తున్నామని సమగ్రశిక్ష జిల్లా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. వీవీమెరక భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారులు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులతో సీఎంవో కేక్ కట్‌చేసి పంచారు. దీనిలో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. దివ్యాంగులు ప్రతీ రంగంలోను రాణిస్తున్నారని సీఎంవో సుబ్రహ్మణ్యం అన్నారు. వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందిస్తే అన్ని రంగాల్లోను రాణిస్తారన్నారు. దివ్యాంగ విద్యార్థులకు భోజనం ఏర్పాటుచేసి పండ్లు పంపిణీ చేశారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించడంలో భాగస్వాములు కావాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లోని శక్తి యుక్తులను వెలికితీసే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైవీ శ్రీనివాస్ పేర్కొన్నారు. దివ్యాంగుల్లోని ఆత్మన్యూనతా భావాన్ని తొలగించి అందరితో సమానమే అన్న స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా ఏటా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో ఏడీ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. దివ్యాంగులైన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.




మాట్లాడుతున్న డీఆర్వో మాధవి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్

ఆటల పోటీల్లో సత్తా చాటారు. ఈసందర్భంగా చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతులు సమకూర్చిన దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అధికారులు వివరించారు. సీఎం చంద్రబాబు దివ్యాంగులకు గతంలో ఎన్నడూలేని విధంగా పెన్షన్ పెంపుదల చేయడాన్ని కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయాకార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కుంచే స్వర్ణలత, రాష్ట్ర అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, జిల్లా అధ్యక్షుడు దొడ్డిపట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొమ్ముల కోటేశ్వరరావు, జేఏసీ అధ్యక్షుడు పెనుమాల నాగరాజు, కొప్పాడి వెంకటనాగరాజు, కూటమి నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆకెళ్ల నారాయణమూర్తి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, కంచిపల్లి అబ్బులు, కరాటం ప్రవీణ్, ఎస్.రాజ్‌కుమార్, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వల్లోకి ఉప్పు నీరు

- దాళ్వా నారుమడులకు సాగునీరేది
- మరో పంట విరామం దిశగా రైతులు
- ఇరిగేషన్ అధికారుల వైఖరిపై ఆగ్రహం

అల్లవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలు రాకుండా కృషి చేస్తుంటే, ఇరిగేషన్ శాఖ రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లవరం మండలంలోని దేవగప్తం-సామంతకుర్రు, తుమ్మలపల్లి, మొగళ్లమూరు-తూర్పులంక, బెండాకాల్వ తదితర పంట కాల్వల్లో నీరు పూర్తిగా తగ్గిపోయి ఉప్పునీరు కాల్వల్లో చేరి రైతులు సాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. దాళ్వా సాగు చేయడానికి, నారుమడులు పోయడానికి సాగునీరు లేక ఆక్వా చెరువుల్లో ఉప్పునీరు చేరి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లవరం మండలంలోని పలు పంట కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి అధ్వాన్నంగా ఉన్నాయి.



అల్లవరం మండలం డి.రావుపాలెంలో నీరు తక్కువగా ఉన్న బందరుకాల్వ

అల్లవరం మండల పరిధిలో ఆరువేల ఎకరాల వరిసాగు చేయాల్సి ఉండగా గత నాలుగేళ్లుగా 1600 ఎకరాల్లో ముంపు వల్ల నాట్లు వేయక రైతులు ఇబ్బందుల పాలయ్యారు. వరి రైతులు, కౌలు రైతులు సాగునీటి ఇబ్బందులతో ఆందోళన చెందుతున్నారు. తొలకరి పంటలో ఎకరాకు పది బస్తాలు కూడా దిగుబడులు రాలేదని వాపోయారు. ఇరిగేషన్ టైల్ డామ్‌లు శిథిలయ్యాయి. వాటిని పునఃనిర్మించాల్సి ఉంది.

ఉత్తమ మార్కుల సాధనకు వంద రోజుల ప్రణాళిక



పాఠశాలలో సూచనలిస్తున్న డీవైఈవో సూర్యప్రకాశం

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధనకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నట్టు అమలాపురం డీవైఈవో జి.సూర్యప్రకాశం పేర్కొన్నారు. గాడిలంక జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. వంద రోజుల ప్రణాళిక తీరు తెన్నులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర విద్యాశాఖ ఈనెల6వ తేదీ నుంచి 10వ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక చేపట్టడం జరిగిందన్నారు. అమలాపురం డివిజన్‌లో ఇప్పటి వరకు 16పాఠశాలలను సందర్శించి వంద రోజుల ప్రణాళిక తీరును పరిశీలించినట్టు ఆయన తెలిపారు. ఈప్రణాళికలో భాగంగా నూటికి 98 మార్కులు సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించినట్టు ఆయన తెలిపారు. సి, డి గ్రేడుల్లో ఉన్న విద్యార్థులను ఏ, బి గ్రేడుల్లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గొర్రెల ఉదయభాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రకృతి సేద్యం భేష్

కలెక్టర్‌కు అరటి పంటను చూపిన రైతు



ప్రకృతి సేద్యం ద్వారా పండించిన అరటిగెలను చూపుతున్న రైతు రాంబాబు

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేంద్రీయ జీవామృతం వాడకం వల్ల భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించడంతో పాటు పోషకాలు తగ్గకుండా సహజ పద్ధతుల్లో సుస్థిరమైన ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చునని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన మానే రాంబాబు ప్రకృతి వ్యవసాయ రైతు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌ను మంగళవారం కార్యాలయంలో కలసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన అరటిగెలను కలెక్టర్‌కు చూపించారు. వారికున్న అరటిపంటలో ఏవిధమైన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా 15ఏళ్లుగా ప్రకృతి సేద్యం చేస్తున్నట్టు వారు కలెక్టర్‌కు వివరించారు.

దోమల లార్వాను పూర్తి స్థాయిలో నివారించాలి

ఉప్పలగుప్తం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ కేసు నమోదైన భట్నపాలెంలో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఇంటింటా జ్వరాల సర్వేను ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల లార్వాలను పూర్తి స్థాయిలో నివారణకు తగిన సూచనలు చేశారు. గ్రామంలో ఎవరికైన జ్వరం వస్తే తక్షణం పీహెచ్‌సీకి తరలించాలన్నారు. కాగా ఎంపీడీవో డి.కృష్ణ గ్రామంలో పారిశుధ్యంపై ఆరా తీశారు. పారిశుధ్య పనులపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.విష్ణుప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం వైద్య శిబిరం కొనసాగింది.

ఓఎన్జీసీ వల్ల జరిగే పంట నష్టంపై సర్వే



పాశర్లపూడిలంకలో సర్వే చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన రైతులు ఓఎన్జీసీ వల్ల పంటలు నష్టపోతున్నామని ఇటీవల కలెక్టర్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూశాఖల అధికారులు పంట నష్టపరిహారంపై సర్వే చేపట్టారు. ఆయా గ్రామాల్లోని వాడబోధి మీడియం డ్రెయిన్‌కు ఇరువైపులా దెబ్బతిన్న కొబ్బరి, మాగాణి భూములను సర్వే చేస్తున్నారు. 400ఎకరాల్లో ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల వరి, కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయని రైతులు ఫిర్యాదు చేయడంతో దీనిపై ఇటీవల అమలాపురం ఆర్డీవో కె.మాధవి, వివిధ శాఖల ఉద్యోగులు దెబ్బతిన్న భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం అంచనా కోసం మూడు శాఖల ఉద్యోగులతో సంయుక్తంగా సర్వేచేసి నష్ట పరిహారాన్ని అంచనా వేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నారు. ఈసర్వేను పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావుతో పాటు పలువురు పరిశీలించారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠం గ్రామంలో ఈనెల14న జరిగే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు (సత్తిబాబురాజు) కోరారు. మంగళవారం ఆదుర్రు, ఈదరాడ, కొమరాడ గ్రామాల్లో సమ్మేళన నిర్వహణపై స్థానికులతో చర్చించి దానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి గోగన్నమఠంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో సమ్మేళనం జరుగుతుందని, దీనికి హిందువులంతా విధిగా హాజరుకావాలని కోరారు. ఈకార్యక్రమానికి శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతీ స్వామిజీ ప్రధాన వక్తగా హాజరవుతారని తెలిపారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారంచేసి ప్రతీ ఒక్క హిందువు సమ్మేళనానికి హాజరయ్యే విధంగా చేసి విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారమే ఎజెండా

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కారుపల్లి కల్యాణ్‌బాబు, మండలశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన చిక్కం రవికుమార్‌లు తెలిపారు. మామిడికుదురులో మంగళవారం జరిగిన కార్యక్రమంలోవారిద్దర్ని ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ నేతలు మట్టా నాగరాజు, కొమ్ముల వీరరాఘవరావు, నేల వెంకటేశ్వరరావు, శిరిగినీడి శ్రీరామ్, తోట ప్రసాద్, కొండయ్య, గంటా వెంకన్న, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

మలికిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బట్టేలంక జడ్పీ హైస్కూలులో ఆత్మ సౌజన్యంతో సోయిల్ హెల్త్ కార్డు ట్రైనింగ్ ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించారు. భూసార పరీక్ష ఆవశ్యకత, ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థూల పోషకాలు, సూక్ష్మపోషకాలపై వివరించారు. ఏవో శిరీష, ఎంఏవో సీహెచ్‌వో రమ్యప్రియాంక పాల్గొన్నారు.

సూక్ష్మ వస్తువుల తయారీ కర్తకు సన్మానం



అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి సూక్ష్మ వస్తువులను తయారుచేస్తూ ఎన్నో రికార్డులు సాధించిన అమలాపురానికి చెందిన తాళాబత్తుల బ్రహ్మాజీని రవాణాశాఖ జిల్లా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ఐరీజ్ లీజర్ 99వ జయంతి సందర్భంగా లీజర్ మెమోరియల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు విభాగాల ప్రముఖ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 1967లో లీజర్ అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి ప్రారంభించి ఎందరికో పురుడులు పోశారన్నారు. తమిళనాడులోని రాయ వేలూరు చెందిన సీఎంసీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎబ్బీసైమాన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెట్టీ సైమాన్, ఆసుపత్రి సీఈవో హెవార్డు రాజ్, వైద్యులు వినీత్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, షైపాల తాతాజీ పాల్గొన్నారు.

రాజోలు నుంచి రాజమహేంద్రవరానికి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు

రాజోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజోలు పరిసర ప్రాంతాల ప్రజలకు ఏపీఎస్ ఆర్టీసీ రాజోలు డిపో నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణికుల, ఉద్యోగుల కోరిక మేరకు రాజమహేంద్రవరంకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందని, బుధవారం నుంచి ఈ సర్వీసు అందుబాటులోకి వస్తుందని రాజోలు డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాజోలులో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ రాజోలు, రాజమహేంద్రవరం మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన టెక్నాలజీ, 36 సిటింగ్ కెపాసిటీ, ఎంటర్‌టైన్మెంట్ కోసం టీవీ వంటి సౌకర్యాలతో కూడిన సూపర్ లగ్జరీ సర్వీసు బస్సును ఏర్పాటు చేశామని తెలిపారు. రాజోలు డిపో నుంచి ఉదయం 6.00 గంటలు, 10.30, సాయంత్రం 5.15గంటలు, రాజమహేంద్రవరం డిపో నుంచి ఉదయం 8.15గంటలు, మధ్యాహ్నం 12.45, రాత్రి 7.15గంటలకు సూపర్ లగ్జరీ బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

బైపాస్ డేంజర్

గ్రామాలకు వెళ్లే పది చోట్ల రహదారుల వద్ద ప్రమాదాలు



మామిడికుదురులోని బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా నాలుగు రోడ్ల కూడలి

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పాశర్లపూడి నుంచి శివకోడు వంతెన వరకు 15కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును నిర్మించారు. 14కిలోమీటర్లలో సుమారు పది చోట్ల వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ఉన్నాయి. ప్రధానంగా మామిడికుదురు నుంచి కొమరాడకు వెళ్లే మార్గంలోని బైపాస్ వేసిన నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ప్రధానంగా కొమరాడ వెళ్లే రోడ్డుకు సుమారు నాలుగు గ్రామాల నుంచి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. బైపాస్ రోడ్డు అధికారికంగా ప్రారంభం కానప్పటికీ అధికసంఖ్యలో వాహనాలు ఈరోడ్డుపై నిత్యం ప్రయాణిస్తున్నాయి. మామిడికుదురులోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఏవిధమైన స్టాపర్లు, స్పీడును నివారించే మార్గాలు లేకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ఈరోడ్డుపై ప్రయాణిస్తున్నారు. ఏ క్షణాన ఏమి జరుగుతుందో అని ప్రజలు భయపడుతున్నారు. ఇదేకాకుండా నాలుగు రోడ్లు ఏర్పడిన పది ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, ఆయా ప్రాంతాల్లో ఈప్రమాదాల నివారణకు జాతీయ రహదారి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా రోడ్డుపై మితిమీరిన వేగంతో వెళ్లకుండా ప్రయాణాలు చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఐటీయూ పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పలగుప్తం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభల పోస్టర్ ఆవిష్కరణ గొల్లవిల్లి శ్రీభీమేశ్వరా ఆడిటోరియంలో మంగళవారం జరిగింది. ఈఏడాది డిసెంబరు 31నుంచి వచ్చే ఏడాది జనవరి 4వరకు విశాఖపట్టణంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.బేబీగంగారత్నం, కె.సుభాషిణి, ఎం.బాలవేణి, ఎన్.ధనలక్ష్మి, శైలజ, మరియమ్మ, భద్రకాళి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయవరం భక్తాంజనేయస్వామి , ఆలయం వి.సావరం ఆంజనేయస్వామి, వెదురుపాక తుల్యబాగ కాలువ వద్ద ఉన్న అంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు ముషిణి రామకృష్ణారావు, కుడుపూడి శ్రీనివాస్, ఏలేశ్వరం రాధాకృష్ణ, పేరి శర్మ, మొల్లేటి వెంకటేశ్వరరావు, వస్కా బాబు, సుగ్గ ప్రసాద్, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యానాం,(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకను యానాం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, కాంగ్రెస్ పార్టీ యానాం ఎన్నికల ఇన్‌చార్జ్ కాటంశెట్టి వెంకటరామ్మూర్తి పర్యవేక్షణలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం యానాంలోని రిక్షా పుల్లర్స్ ఆటో డ్రైవర్లు, వృద్ధులకు, ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు రాజబాబు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్

అమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భట్నపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పేరూరులో రెండో రోజు మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.దుర్గారావు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల్లో చెత్తాచెదారాలను విద్యార్థులు తొలగించారు. స్వచ్ఛభారత్‌పై ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవీసుధీర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జనవరి 25న ఆత్మీయ కలయిక

అమలాపురంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 2026 జనవరి 25న మాదిగల ఆత్మీయ కలయిక అమలాపురంలో నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ప్రకటించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ ఇన్‌చార్జి డాన్‌సూరి మాదిగ, జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తులు మాట్లాడుతూ జనవరి 25న జరిగే ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆకుమర్తి మోహన్, ఆకుమర్తి రమేష్, మంద రామకృష్ణ, చుట్టుగుళ్ల నీలకంఠం, సత్తాల దుర్గారావు, ఆకుమర్తి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి'

ఐ.పోలవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను కులం పేరుతో దూషిస్తున్న యు.కొత్తపల్లి మండలం వెంటపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు శ్రీనును సస్పెండ్ చేయాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీనును అధికారులు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని, వెంటనే అతడిని ఉద్యోగం నుంచి తొలగించాలని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో తాళ్ళూరి ప్రసాద్, మచ్చ నాగబాబు, నాతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

కాట్రేనికోన, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్ఎం మెమోరియల్ హైస్కూల్‌కు ఫ్రెండ్లీ క్లబ్ సభ్యులు ఆరు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. మంగళవారం హెచ్ఎం రేకపల్లి అంబకు ఫ్యాన్లను ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్రజోగయ్యశాస్త్రి అందించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి, ఆకొండి ఉమామహేష్ శర్మ, గ్రంధి నానాజీ చల్లా గోపి, పీబీఎంకే మూర్తి, సుంకర పవిత్రకుమార్, ఆణివిళ్ళ ఉషాకిరణ్, ఆకొండి శ్రీరామచంద్రమూర్తి(సింగపూర్) పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు ఉత్సవాలు

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం ముస్లింవీధిలో ఉన్న సయ్యద్ హజరత్ ఖ్వాజాబాబా 68వఉరుసు మహోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు షేక్ బాషాజాన్, ఎండీ బషీర్‌లు తెలిపారు. 10వతేదీ సాయంత్రం 4గంటలకు ఫకీరు మేళాలతో బాబా దర్గా నుంచి గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 11న మహిళల మిలాద్, 12న జియారత్ ఫతేహాఖానీ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు మాదిగల ఆత్మీయ కలయిక

అమలాపురంరూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈనెల11న మాదిగల ఆత్మీయ కలయిక రాజకీయ పార్టీలకు అతీతంగా యథావిధిగాజరుగుతుందని మాదిగల పొలిటికల్ జేఏసీ ప్రకటించింది. ఎటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాదిగ పేర్కొన్నారు. కొంకాపల్లి శ్రీసత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయికను జిల్లాలోని మాదిగలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, వివిధ సంఘాల నాయకులు మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు, మెరుగుపువ్వు మోహనరావు, ఆకుమర్తి దుర్గారావు, ఉందుర్తి ప్రసాద్, మల్లవరపు శ్రీను, సవరపు నానిబాబు, బుంగ ఆనంద్‌శేఖర్ కోరారు.

ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

రాజోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఎస్సీ సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజోలులో బొడ్డపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో దళిత చైతన్యవేదిక నాయకులు మంగళవారం ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ఇంటి గుమ్మాలకు అంబేడ్కర్ ముఖ చిత్రంతో ఉన్న స్టిక్కర్‌ను అతికించారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణాలను మంజూరు చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం, ఎస్సీల సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, మట్టా సురేష్, కాకర విశ్వనాథం, గోగి రవీంద్ర, విప్పర్తి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే గిడ్డి



వాడవాడకు ఎమ్మెల్యే కార్యక్రమంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అర్జీల రూపంలో స్వీకరించి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చూపడం, వాడవాడకు మన ఎమ్మెల్యే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పొట్టిలంక, కొండుకుదురు గ్రామాల్లో వాడవాడకు ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇరు గ్రామాల ప్రజలు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే వద్ద ప్రతిపాదించారు. ఈసమస్యలను త్వరలోనే పరిష్కరించనున్నట్టు ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, సర్పంచ్‌లు కోనే సునీతసుబ్బలక్ష్మి, మేడిద దుర్గాప్రసాద్, పోలిశెట్టి రాజేష్, వస్కా శ్యామ్, బొబ్బా ప్రభాత్‌కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, ఎంపీడీవో సరోవర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో కుటుంబానికే రక్షణ

ఉప్పలగుప్తం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి ధరించే హెల్మెట్ అతనికే కాకుండా మొత్తం అతని కుటుంబానికే రక్షణ కవచంగా నిలుస్తుందని అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. సిరిపల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారిపై గొల్లవిల్లి -సన్నవిల్లి సెంటర్‌లో మంగళవారం బైక్‌లను నిలిపి, వాహనచోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. అక్కడే హెల్మెట్‌లు కొనిపించి స్వయంగా ఆయనే వారి తలలకు అమర్చారు. బైక్ నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ సీహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్ శిక్షణ

మలికిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈసీ సభ్యులు, వీవోఏలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటిరోజు జాతీయస్థాయిలో ఎన్ఆర్ఎల్ఎం, రాష్ట్రస్థాయిలో సెర్ప్, జిల్లా స్థాయిలో డీఆర్డీఏ ద్వారా సంఘాల్లో కుటుంబంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ సొంతంగా కలను సాకారం చేసుకునేందుకు రాబోయే ఐదేళ్ల కాలంలో ఏవిధంగా నెరవేర్చుకోవాలనే ప్రణాళికను నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమం ద్వారా తెలియజేస్తామని ఏపీఎం ఎస్కే సయ్యద్ అన్నారు. ముఖ్య అతిథిగా మేడిచర్ల వెంకటసత్యవాణి మాట్లాడారు. మండలంలో ప్రతీ గ్రామంలోను మహిళా సమాఖ్య ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, వ్యక్తిగతంగా లక్ష్యాలను చేరుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ఓబీ సభ్యులు, ఈసీ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం ప్రారంభం

అమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో జిల్లా ఔషధ నియంత్రణశాఖాధికారి కార్యాలయాలను ప్రారంభించారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన జిల్లా అధికారి కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చంద్రమౌళి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రత్యేక నిధులతో ఇంటింటికీ వైద్య సేవలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఔషధ నియంత్రణ అధికారి బి.శ్రీనివాసరావు, సర్పంచ్ దాసరి అరుణ-డేవిడ్, బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను అక్కున చేర్చుకోవాలి

పి.గన్నవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల గల చిన్నారులను ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకుని వారిపై వారికి నమ్మకం కలిగించాలని ఎంఈవో కె.హెలీనా అన్నారు. పి.గన్నవరం జడ్పీ హైస్కూల్లో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి వివిధపోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ఆరేళ్ల ఎం.ప్రణవిహర్యలక్ష్మి పాడిన గీతాలుఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఆ చిన్నారిని ఎంఈవోలు, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ వీరభద్రనందం, ప్రధానోపాధ్యాయిని కోసూరి ఉమాదేవి, ఐఈఆర్‌టీలు డి.సంగీత, ఎన్.ప్రియాంక, సీజీవి శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు రూ.లక్ష జరిమానా

పి.గన్నవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరంలో సీజ్ చేసిన రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు చక్రు లారీలకు రూ.లక్ష జరిమానా విధించినట్లు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ఈనెల5న లంకలగన్నవరం పరిధిలో ఇసుక తవ్వకాలకు బాట ఏర్పాటు చేస్తుండగా రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు చక్రు లారీలను తహశీల్దార్ సీజ్‌చేశారు. ఎక్స్‌కవేటర్లకు రూ40వేలు చొప్పున, లారీలకు రూ.10వేలు చొప్పున మొత్తంగా రూ.లక్ష జరిమానా విధించారు.

దివ్యాంగ బాలికకు మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

అమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రంగాపురానికి చెందిన యనమదల పార్వతి కుమార్తె సబితగౌరి మానసిక పరిస్థితి బాగోకపోవడంతో పాటు అంగ వైకల్యంతో బాధపడుతోంది. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం సమనస శివారు రంగాపురానికి చేరుకుని ఆమెకు రూ.15వేలు అందించారు.

ప్రమాదాల నివారణకు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపడంతో పాటు కనీస రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని సీఐ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై పలువురు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ ఏసుబాబు, ఆటో యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ నియంత్రణశాఖ ఆఫీస్ ప్రారంభం

అమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో జిల్లా ఔషధ నియంత్రణశాఖాధికారి కార్యాలయాలను ప్రారంభించారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారి కార్యాలయాన్ని డీసీఎంఎస్ చైర్మన్ పి.చంద్రమౌళి ప్రారంభించారు.



పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొన్న దృశ్యం

రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ద్రాక్షారామ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ మంగళవారం ద్రాక్షారామలో అఖిలపక్ష జేఏసీ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టింది. బోసుబొమ్మ సెంటర్‌లో రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ సంతకాల సేకరణతో పాటు, పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఐదు నెలలుగా అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించినా, 52 పంచాయతీలు, మున్సిపాలిటీ , రెండు మండల పరిషత్‌లు ఏకగ్రీవంగా తీర్మానించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కోకన్వీనర్ బి.సిద్ధూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లాలో కలపకపోవడం వల్ల రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కూడా కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపకపోతే మున్సిపల్, స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పీఏసీఎస్ త్రీమన్ కమిటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, ఆళ్ల సుబ్రహ్మణ్యం, ఆళ్ల బుజ్జి, ఎ.కొండ తదితరులు పాల్గొన్నారు.


రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కేంద్రమంత్రిపై ఆరోపణలు హేయం

వైసీపీపై టీడీపీ నేతల ధ్వజం

రావులపాలెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడును టార్గెట్ చేస్తూ వైసీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని టీడీపీ నాయకులు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పనితీరును కేంద్రంలోని పెద్దలు ప్రశంసిస్తుంటే వైసీపీ మాత్రం కేంద్రమంత్రి రాజీనామా చేయాలి అని మాట్లాటడం వారి వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. పరిస్థితిని చక్కబెట్టడానికి కేంద్రమంత్రి పడుతున్న శ్రమకు ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. ప్రయాణికులకు రూ.610 కోట్లు చెల్లించడం, ఇతర విమాన సర్వీసులు పెంచడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, ముత్యాల బాబ్జి, కాసా సాగర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదంలో మహిళకు గాయాలు

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండపేటలోని కొండపల్లి వీధిలో ఇంట్లో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ పైపు పగిలిన ఘటనలో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం...కొండపల్లి వీధిలో ఉంటున్న గృహిణి వంట చేసే సమయంలో మంటలు రావడంతో తీవ్ర గాయాలతో బయటపడింది. స్థానికులు మండపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలు చెలరేగిన సమయంలో ఆమె తప్ప మరెవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. గాయపడిన మహిళను స్థానికులు ఆసుపత్రికి తరలించగా కోలుకుంటోంది. గ్యాస్ సిలెండర్ ట్యూబ్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి మార్చుకోవాలని లేకుంటే ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సూచిస్తున్నారు.

డ్వాక్రా సంఘాలకు శిక్షణ


మాట్లాడుతున్న ఏపీఎం శ్యామూల్

కె.గంగవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం వెలుగు కార్యాలయంలో మంగళవారం మహిళా సాధికారతపై డ్వాక్రా సంఘాల సభ్యులు, వీవోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏపీయం శామ్యూల్ మాట్లాడుతూ మహిళా సంఘాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.దుర్గాదేవి, అకౌంటెంట్ సూర్యనారాయణ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



గేటు మీటింగ్‌లో నినాదాలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

స్త్రీశక్తి పథకంలో తలెత్తే సమస్యలను పరిష్కరించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం వల్ల ఆర్టీసీ ఉద్యోగులకు ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ యూనియన్ల జేఏసీ గేట్ మీటింగ్ డిమాండు చేసింది. మంగళవారం యూనియన్ల జేఏసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఎస్ నారాయణ, రావులపాలెం డిపో బాధ్యుడు చిన్నారావు, రామచంద్రపురం యూనియన్ కార్యదర్శి వరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంతో బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. బస్సుల సంఖ్య పెంచాలని, బస్సులకు హైడ్రాలిక్ డోర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని డిమాండు చేశారు. సమావేశంలో త్రిమూర్తులు, వెంకన్న , ఏఎస్ నారాయణ, టి.రాజు, రాంబాబు, నాగమణి, అప్పారావు, పీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిపో మేనేజర్ ద్వారా ఎండీకి వినతిపత్రం అందజేశారు.


ఉపాధ్యాయుల డివిజనల్ లెవెల్ గేమ్స్ షెడ్యూల్‌పై మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

క్రీడా పోటీలకు సన్నద్ధం కావాలి

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే కొత్తపేట డివిజన్ లెవెల్ ఉపాధ్యాయుల క్రీడా పోటీలకు సన్నద్ధం కావాలని డీఈవో షేక్ సలీంబాషా కోరారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారులు, పీడీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా మైదానాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ పోటీలలో క్రికెట్ పోటీలకు పురుష ఉపాధ్యాయులు, త్రోబాల్ పోటీలకు మహిళా టీచర్లు పాల్గొనేలా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీవైఈవో ఏ.రామకృష్ణమూర్తి ఎంఈవో ఎం.హరిప్రసాద్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎఎస్ఎస్ రమాదేవి, పీడీలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలోనున్న స్వామివారు

ఆంజనేయస్వామికి పూజలు

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం సందర్భంగా ఆలయ అర్చకులు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. స్వామివారికి తమలపాకులతో పాటు అప్పాలతో చేసిన దండలను అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కొండూరి మాణిక్యాలరావు కుటుంబ సభ్యులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయవరం భక్తాంజనేయస్వామి , ఆలయం వి.సావరం ఆంజనేయస్వామి, వెదురుపాక తుల్యభాగ కాలువ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం పంచమి మంగళవారాన్ని పురస్కరించుకుని వెదురుపాకలో అర్చకుడు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అంజనేయస్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, నాగవళిదళ అర్చన, సింధూర పూజ , నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్తమూరులో వున్న సత్యభాస్కర జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థినులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. బొమ్మూరుకు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు పాఠశాలకు చెందిన హెచ్‌ఎం పి.సూర్యకుమారి ద్వారా స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు మాలిక్‌బాషా, వి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల ఆలయంలో ఏపీఐడీసీ చైర్మన్ పూజలు

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కుటుంబంతో కలిసి అలిపిరి మెట్ల మార్గం గుండా నడుచుకుంటూ వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక దర్శనం అనంతరం వారు వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

విగ్రహం ఏర్పాటుకు చర్యలు

రావులపాలెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయ నిర్మాత పినపోతు గజేంద్రుడు విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో మంగళవారం అగ్నికుల క్షత్రియుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో పాటు ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వాడపల్లి ఆలయం వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన చరిత్ర శాశ్వతంగా నిలిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థలాన్ని ఏర్పాటు చేసి అగ్నికుల క్షత్రియులు కోరిన విధంగా విగ్రహ నిర్మాణం చేపడతామన్నారు. మత్స్యకారులకు అందించిన పలు ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిలువూరి సతీష్‌రాజు, కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి, అగ్నికుల క్షత్రియ సంఘాల అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కపిలేశ్వరపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో హలో మాదిగ చలో అమలాపురం కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పిప్పల సంపతరావు, తాతపూడి రాజేష్ మాట్లాడుతూ కొంకాపల్లిలో ఈనెల 11న గురువారం నిర్వహించే ఆత్మీయ కలయికకు మాదిగలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దలు కొమ్ము బాబూరావు, కె.మీరాసాహెబ్, తాతపూడి అబ్రహం, వేమగిరి దావీదు, కందుకూరి కిరణ్, బుంగ దావీదు, కె.కృష్ణ, చాపల నవీన్ కుమార్, ఆర్.రాజేష్, ఎం.అబ్బులు, ఎం.నవీన్‌కుమార్, రాజు, పెద్ద తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మాణానికి చెట్ల తొలగింపు


హైవే అధికారులు తొలగించిన చెట్లు

ఆలమూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వద్ద ఉన్న వంతెన వరకు సర్వీసు రోడ్డు నిర్మాణానికి సంబంధించి 96 చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి ఇచ్చింది. 3.1 కిలోమీటర్ల పొడవునా సర్వీసు రోడ్డు నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ సర్వీసు రోడ్డు పొడవునా వేప, రావి, గానుగ వంటి పలు చెట్లు ఉన్నాయి. వీటి తొలగింపునకు నేషనల్ హైవే అధికారులు అటవీశాఖ జిల్లా అధికారులకు అనుమతి కోరగా వారు అనుమతి ఇచ్చారు. ఆయా చెట్లను బట్టి వాటి ధరలను నిర్ణయించారు. నేషనల్ హైవే అధికారులు పాటలు నిర్వహించి చెట్లను తొలగించేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో ఈ మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఆయా చెట్లను తొలగించేం దుకు శ్రీకారం చుట్టారు. ఆయా చెట్లలో కొన్ని పురాతన వృక్షాలు ఉండగా మరికొన్ని పాతికేళ్ల క్రితం నాలుగు లైన్ల విస్తరణ సమయంలో వేసినవి ఉన్నాయి.

మంత్రి సుభాష్‌ను కలిసిన తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు


మండపేటలో మంత్రి సుభాష్‌ను కలిసిన తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సత్యవతి

మండపేట, డిసెంబరు, 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గడి సత్యవతి మంగళవారం రామచంద్రపురంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. రామచంద్రపురం పట్టణంలో వున్న 2, 4 బూత్‌లకు సత్యవతిని పార్టీ పరిశీలకురాలిగా నియమితులయ్యారు. ఇందులో భాగంగా మంత్రిని ఆమె కలిశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించటంతోపాటు పార్టీ బలోపేతా నికి కృషి చేయాలని మంత్రి ఆమెకు సూచిం చారు. ఆమెతోపాటు మంత్రిని కలిసిన వారిలో పార్టీ పరిశీలకులు కాకినాడ రామా రావు, స్థానిక నాయకులు గడి గోవిందు తదితరులు వున్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు గడి సత్యవతి మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి సుభాష్‌ను కలిశారు. రామచంద్రపురం పట్టణంలో 2, 4 బూత్‌లకు పరిశీలకురాలిగా ఆమెను నియమించిన నేపథ్యంలో బూత్‌ల పరిధిలో పర్యటించారు. అనంతరం మంత్రిని కలిసి పార్టీ పరిస్థితిపై ఆమె చర్చించారు.

క్యాన్సర్ బాధితుడికి మంత్రి ఆర్థికసాయం: ద్రాక్షారామ బియ్యంపేటకు చెందిన వాసంశెట్టి శంకర్రావు కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి మంగళవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అంగర పీహెచ్‌సీలో డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా వారికి రక్తపరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రత్నకుమారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బి. అనంతరామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. రామారావు, హెచ్‌వీ టి.మేరీమణి, హెచ్‌ఎస్ ఎం. నాని బాబు, స్టాఫ్‌నర్సు జె.బంగారుపాప, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, ఫార్మాసిస్ట్ ప్రిస్కిల్లా, ఎల్ఎంహెచ్‌పీలు దేవి, రమ, ఆరోగ్య కార్యకర్తలు దుర్గ, బేబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగరలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రత్నకుమారి

పంట వ్యర్థాలతో నేలకు మరింత బలం

కె.గంగవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తొలకరి పంట వ్యర్థాలను చేలల్లో కుళ్లిపొయ్యే పద్ధతుల వల్ల నేలలో భూసారం పెరగడంతో పాటు తదుపరి పంటకు మేలు జరుగుతుందని ఏవో సద్గురుమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని గంగవరం, శేరిలంక గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో శేరిలంక సర్పంచ్ కొండేపూడి భద్రరావు, ఎంపీటీసీ అప్పారావు, కూటమి నాయకులు అర్జున్, వీహెచ్‌ఏ సంజిత్, వీఏఏ నవ్య, చందు, పలువురు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో సద్గురుమూర్తి


ఆలమూరు మండలం నర్సిపూడిలో త్రైత సిద్ధాంతంపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

త్రైత సిద్ధాంతం ద్వారా దేవాలయాలపై అవగాహన

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతాలలో ఉన్న ఆధ్యాత్మిక ద్వారా దేవాలయాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ చైర్మన్ శేఖర్‌బాబు అన్నారు. ఆలమూరు మండలం నర్సిపూడిలో త్రైత సిద్ధాంత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం కమిటీ ప్రతినిధులు శేఖర్‌బాబు, మూర్తి, లక్ష్మీనారాయణ, లోహిత, భారత్, జయరాం, సంధ్యారాణి, రాణి, సూర్యకుమారి, వేణు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం


మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరామన్

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీంబాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో రామన్, ఐఈఆర్ జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ పలు అంశాలను వివరించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ బాలలకు బహుమతుల ప్రదానం చేశారు. సహకారం అందించిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు పాల్గొనగా, ఐఈఆర్టీలు అరుణ, జానకీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మండపేట నుంచి సింహాచలానికి కాలినడకన బయలుదేరిన టీడీపీ నాయకులు

మొక్కు చెల్లించేందుకు సింహాచలం పయనం

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విజయం సాధించాలని టీడీపీ నాయకులు సింహాచలం అప్పన్నకు అప్పట్లో మొక్కుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే విజయం సాధించడంతో కపిలేశ్వరపురం మండలం వాకతిప్పకు చెందిన అల్లూరి రామకృష్ణచౌదరి, రాయవరం మండలం చెల్లూరుకు చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, టీడీపీ రాయవరం మండల నాయకులు ఉండవల్లి రాంబాబు, బుబ్బల శ్రీనులు స్వామివారి మొక్కును చెల్లించేందుకు మంగళవారం మండపేట నుంచి కాలినడకన సింహాచలం బయలుదేరారు. తొలుత వారంతా మండపేటకు చేరుకుని కేపీరోడ్డులో వున్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్‌బాబుతో కలిసి నిర్వహించారు. అనంతరం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. ఆరు రోజులపాటు పాదయాత్ర సాగుతుందని వారన్నారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ వాకచర్ల గుప్తా, బలుసు శ్రీనువాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సలాదికి డైరెక్టర్ పదవి పట్ల హర్షం

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకవర్గంలో ఆలమూరు మండలానికి ఒక డైరెక్టర్ కేటాయింపు చేశారు. ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సలాది నాగేశ్వరరావును డైరెక్టర్‌గా నియమించారు. మండలం నుంచి ఆయన్ను నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్‌గా నియమితులైన ఆయన్ను పలువురు కూటమి నాయకులు అభినందించారు.

నలుగురు నియామకంపై హర్షం

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి మండలానికి చెందిన నలుగురిని డైరెక్టర్లుగా నియమించారు. వారిలో తమ్మన సాయి ప్రసాద్, సరెళ్ళ సరిత, చింతపల్లి సత్యనారాయణ, యల్లమిల్లి చంద్రకుమారిలను నియమించారు. వీరి నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


ఆరోపణలపై విచారణ జరుపుతున్న దృశ్యం

వైద్యాధికారిణిపై విచారణ

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేశవరం గ్రామంలో వున్న ఆరోగ్యం కేంద్ర వైద్యాధికారిణి సీహెచ్ రమ్య ఆసుపత్రిలోని సిబ్బందిని వేధింపులకు గురి చేస్తున్నారని సిబ్బంది జిల్లా అధికారికి చేసిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ చేపట్టారు. మంగళవారం డివిజనల్ అధికారి సుమలత దీనిపై విచారణ చేపట్టారు. సిబ్బందిని విచారించి వైద్యురాలి వేధింపులపై వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది నుంచి లిఖిత పూర్వక వివరాలను తీసు కున్నారు. వీటిని జిల్లా అధికారికి వివరి స్తానని ఉద్యోగులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

హెల్మెట్ లేకపోతే కఠిన చర్యలు

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే వారు విధిగా హెల్మెట్ ధరించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ హెచ్చరించారు. ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్లో మంగళవారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో ప్రమాదం జరిగితే తలకి తప్ప అవయవాలకు దెబ్బ తగిలినా ప్రాణానికి ప్రమాదం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీసుల హెచ్చరికలను వినకపోతే చర్యలు తీసుకోక తప్పదని వారు హెచ్చరించారు. ఈ సదస్సులో ఏఎస్ఐ సూర్యచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాంత్రంలో జ్వర సర్వే పరిశీలన

కె.గంగవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాంత్రం గ్రామంలో మంగళవారం డీఎంహెచ్‌వో దుర్గారావు దొర పర్యటించి, గ్రామంలో జరుగుతున్న జ్వరాల సర్వేను పరిశీలించారు. గ్రామానికి చెందిన ఒకరికి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకగా, కాకినాడలో చికిత్స పొందుతున్నారు. దీనిపై కాకినాడ జీజీహెచ్ నుంచి వచ్చిన నివేదికతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమై, గ్రామంలో ఇంటింట సర్వే నిర్వహించారు. జ్వరం ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామంలో ఇంటింట సర్వే నిర్వహించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సాంబశివరావు, ఎంపీటీసీ కోట సత్తిబాబు, పేకేరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్త నమూనాలను సేకరిస్తున్న దృశ్యం